క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జమ్మలమడుగు: పట్టణ సమస్యలపై మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వేసవిలో తాగునీరు , ఇండ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు తీరుతోపాటు ప్రజల మౌళిక సదుపాయాలపై సమీక్షా సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, అధికారులందరూ తప్పక హాజరు కావాలని సూచించారు.

గడ్డివామి దగ్ధం

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలపరిధిలోని మోరగుడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సత్యబాబుకు చెందిన గడ్డివామి దగ్ధం అయింది. సోమవారం మధ్యాహ్నం ఆకతాయిలు సిగరెట్ తాగి ముళ్ల పొద ల్లో వేయడంతో మంటలు వ్యాపించాయి. ఈ సంఘటనలో సత్యబాబుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మైలవరం (జమ్మలమడుగు రూరల్): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మైలవరం మండల అధ్యక్ష్యుడు విజయ కుమార్ మాదిగ కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో దళిత నాయకులు తహశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గురప్ప, ఓబులేసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం పాట

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొలుముపల్లి పంచాయితీ పరిధిలో గల పునాది రాళ్ళు తరలించుకునే వాహనాలకు సంబంధించిన టోల్ గేట్‌కు వేలం పాటను మంగళవారం నిర్వహిస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి జిఎల్ నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే వారు పంచాయితీ కార్యాలయం పేరు పైన ఎస్‌బీఐ బ్యాంకులో రూ. లక్ష డీడీ తీసి పాటలో పాల్గొనాలన్నారు. హెచ్చు పాటదారుడు మిగిలిన మొత్తాన్ని పాట అనంతరం చెల్లించాలన్నారు.

వైభవంగా గంగ జాతర



గ్రామోత్సవంలో గంగమ్మ, నల్లనమ్మ, అంకాలమ్మ ప్రతిమలతో భక్తులు

వీరపునాయునిపల్లె: వీరపునాయునిపల్లె గ్రామ ప్రజలు భక్తితో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర సోమవారం వైభవంగా ముగిసింది. సోమవారం ఉదయం గంగమ్మ, నల్లనమ్మ, అంకాలమ్మ, బోగాదమ్మ తల్లులకు బోనాలు సమర్పించారు. కోరికలు నెరవేర్చు తల్లీ.. అంటూ భక్తులు ప్రార్థనలు చేశారు. ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం భారీగా బాణ సంచా పేలుస్తూ డప్పు వాయి ద్యాల మధ్య అమ్మవార్ల ప్రతిమలను గ్రామో త్సవంగా తీసుకెళ్లి గ్రామ పొలిమేర వద్ద వదిలి పెట్టడంతో జాతర ముగిసింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు జాబ్‌మేళా

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు వెలుగు కార్యాలయంలో మంగళవారం ఆదిత్య బిర్లా మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం వెంకట నారాయణ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ కంపెనీలో 500మంది ట్రైనీ టైలర్స్ కోసం జాబ్ మేళా నిర్వహించనున్నామని.. ఈ జాబ్ మేళాకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. ఈ జాబ్ మేళాకు 18 ఏళ్ల నుంచి 32 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 74167 89336 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు

వేంపల్లె : చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద దివంగత మాజీ సర్పంచ్‌లు ఎం.రామచంద్రారెడ్డి, ఎం.రాధికారెడ్డిల జ్ఞాపకార్థం శ్రీసాయి రజిత గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చలివేంద్రాన్ని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఏపీ ఐబీసీ రాష్ట్ర డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎంపీటీసీలు మణి గోపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వల్లూరు: కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు బస్టాపు వద్ద పోలేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ట్రస్ట్ నిర్వాహకుడు వంకదార ఆంజనేయులుతో కలిసి ఎంఈవో లిల్లెమ్మ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సేగు సురేష్ బాబు, మేడా రమేష్, రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు ప్రారంభం

కమలాపురం: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. పట్టణంలోని జడ్పీ బాయ్స్, గరల్స్ హైస్కూల్స్‌తో పాటు గురుకుల పాఠశాలలో పరీక్షా సెంటర్లు నిర్వహించారు. మొదటి రోజు సోమవారం తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం 9.30గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా గంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. వారిని పోలీసులు, మహిళా పోలీసులు హాల్‌టికెట్లను పరిశీలించి పరీక్షా కేంద్రాల్లోకి పంపించారు. ఈ పరీక్షకు మొత్తం 551 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 549మంది హాజరయ్యారు. జడ్పీ బాయ్స్ హైస్కూల్ సెంటర్‌లో 152మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారు. అలాగే గరల్స్ హైస్కూల్‌లో 160కి 160 మంది హాజరయ్యారు. గురుకుల పాఠశాలలో 239 మందికి 238 మంది హాజరయ్యారు.

ఎర్రగుంట్ల : పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో నాలుగు పరీక్ష కేంద్రాలు, చిలంకూరులో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాలలో పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. 1058 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 54 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. జెడ్పీ బాయ్స్, గరల్స్ హైస్కూల్స్, సెయింట్ థామస్, జీవన్‌జ్యోతి స్కూల్స్, చిలంకూరులోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్స్‌లను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. చిలంకూరులో పరీక్ష కేంద్రంలో కూడా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

చింతకొమ్మదిన్నె : మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో సోమవారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని మండల విద్యాశాఖాధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు. మొత్తం విద్యార్థుల సంఖ్య 645 కాగా, 645 మంది హాజరయ్యారన్నారు.

వల్లూరు: వల్లూరు మండలంలో పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మొత్తం 305 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా మొదటి రోజు తెలుగు పరీక్షకు అందరూ హాజరయ్యారని పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

వేంపల్లె : పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉండటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 9 గంటల్లోపే చేరుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 1046 మంది పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా.. 1043 మంది హాజరైనట్లు ఎంఈఓ బండి వీరారెడ్డి తెలిపారు. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. కేంద్రాల వద్ద సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

లింగాల : మండల కేంద్రమైన లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని ఎగ్జామినేషన్ చీఫ్ రవిచంద్రారెడ్డి తెలిపారు. 204 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 203 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షలకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు వ్యవహరించారన్నారు. పరీక్ష ప్రారంభం నుంచి ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్స్ పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించారన్నారు.

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాలలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం గట్టి బందోబస్తు మధ్య 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి పరీక్షా కేంద్రంలో 174 మంది విద్యార్థులకు గాను 173 మంది హాజరయ్యారు. రెండవ కేంద్రంలో 148 మందికి గాను 145 మంది హాజరయ్యారు. ఏఎస్సై రమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

చెన్నూరు : చెన్నూరులోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో, అలాగే మూడు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 349 మంది పదవ తరగతి పరీక్షలు రాస్తుండగా వీరిలో 188 మంది బాలురు, 169 మంది బాలికలు ఉన్నారు. ఇందుకు రెండు పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని సెంటర్‌లో 188 మంది, ఆర్‌ఆర్ పాఠశాలలో 161 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అయితే బాలికల ఉన్నత పాఠశాలలో తొలిరోజు 188 మంది పరీక్షలకు హాజరు కాగా, ఆర్‌ఆర్ పాఠశాలలో 161 మందికి ఇద్దరు గైర్హాజరైనట్లు అధికారులు తెలియజేశారు. ఆయా పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు పరిశీలించారు. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



పులివెందుల టౌన్ : పరీక్షలు రాస్తున్న పదవ తరగతి విద్యార్థులు

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండల వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలకు రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నారాయణరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన జెడ్పీ హైస్కూలులో 120మంది విద్యార్థులు, వైఎస్ రాజారెడ్డి జూనియర్ కళాశాలలో 244మంది పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించినట్లు ఎంఈఓ తెలిపారు. ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేముల : మండల కేంద్రమైన వేములలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వేముల కస్తూర్బా గాంధీ పాఠశాల, గొల్లలగూడూరు, చాగలేరు, నల్లచెరువుపల్లె, సెవెన్త్‌డే హైస్కూలు, తాళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 299 మంది విద్యార్థులు సోమవారం పరీక్షలు రాశారు. వేముల హైస్కూలు సెంటర్‌లో 199మంది, కస్తూర్బా గాంధీ పాఠశాల సెంటర్‌లో 91మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ ధనుంజయుడు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు.

పులివెందుల టౌన్ : పులివెందుల మండల వ్యాప్తంగా సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(అంకాలమ్మపేట), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రమణప్ప సత్రం), వివేకానంద ఉన్నత పాఠశాల (బ్రాహ్మణపల్లెరోడ్డు), నలంద ఉన్నత పాఠశాల (పార్నపల్లెరోడ్డు), వెంకటప్ప ఉన్నత పాఠశాల (భాకరాపురం), సెయింటాన్స్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలలో మొత్తం 1667మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 1651మంది పరీక్షలు రాశారన్నారు. 16మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఎంఈఓ బండి వీరారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు.



కమలాపురం: గురుకుల పాఠశాల వద్ద వేచి ఉన్న తల్లిదండ్రులు



ఎర్రగుంట్ల: పరీక్ష రాసేందుకు తరలివస్తున్న విద్యార్థులు



వేంపల్లె : పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు పర్యవేక్షిస్తున్న పోలీసులు

నేడు తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు

పులివెందుల : పులివెందుల నుంచి తిరువణ్ణామలై(అరుణాచలం)కు మంగళవారం ప్రత్యేక బస్సు సర్వీసు వెళ్లనున్నట్లు ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సోమవారం ఆయన తెలుపుతూ పులివెందుల ప్రాంత ప్రజలకు పులివెందుల, వేముల, వేంపల్లె, గండి, చక్రాయపేట మీదుగా అరుణాచలంకు ప్రతినెలా పౌర్ణమి ముందు రోజున గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామని.. పులివెందుల, వేముల నుండి ఒక్కొక్కరికి రానుపోనూ రూ.1200లు, వేంపల్లె, గండి, చక్రాయపేట నుండి ఒక్కొక్కరికి రానుపోనూ రూ.1100ల టిక్కెట్ ధర ఉంటుందని... ఈ అవకాశాన్ని పులివెందుల, వేంపల్లె ప్రాంతాల ప్రయాణీకులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 79898 99479, 99664 52010 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా సంబరాలు

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలోని వీఆర్‌యస్ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం ఉదయం 10గంటలకు వైఎస్ఆర్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపురెడ్డి, వెలుగు కార్యాలయం ఏపీఎం భాగ్యమ్మ తెలిపారు. ఈ సంబరాలకు కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు వారు తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఆయన పంపిణీ చేస్తారని తెలియజేశారు.

లింగాల : లింగాల మండలంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కులను మంగళవారం పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. మండల కేంద్రమైన స్త్రీశక్తి భవన్‌లో ఎంపీపీ అమృత అధ్యక్షతన డ్వాక్రా సంఘాల సమావేశం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. మండలంలోని 528 డ్వాక్రా సంఘాలకు రూ.4.38కోట్లు విలువ చేసే చెక్కు డ్వాక్రా సంఘాలకు అందించనున్నారని ఆయన తెలిపారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్): మైలవరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు 3వ విడత వైఎస్సార్ ఆసరా చెక్ పంపిణీ కార్యక్రమం జరుగనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోరెడ్డి మహేశ్వర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి హాజరై చెక్కులు పంపిణీ చేస్తారన్నారు.

మతసామరస్యానికి చిహ్నం రంజాన్

కడప కార్పొరేషన్: పవిత్ర రంజాన్ పండుగ మత సామరస్యానికి చిహ్నమని ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన దుబాయ్ వెళ్లి అక్కడ ఏపీఎన్ఆర్‌టీఎస్ కో ఆర్డినేటర్ సయ్యద్ అక్రం, వ్యాపారవేత్త షేక్ సమీవుల్లా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారత కాలమానం ప్రకారం 8.30 గంటలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మలకు ప్రభుత్వం బాసట

సింహాద్రిపురం : అక్కాచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారని మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం మార్కెట్ యార్డు ఆవరణంలో వైఎస్సార్ ఆసరా మూడవ విడత రుణ మాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ పథకాలను కుల, మత, పార్టీ బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏ పథకం అందాలన్నా ఆ పార్టీ నాయకుల పెత్తనం ఉండేదన్నారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి జగనన్న ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా 523 డ్వాక్రా సంఘాలకు మూడవ విడత కింద రూ.5,24,19,390 చెక్కులను డ్వాక్రా మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, రాష్ట్ర డైరెక్టర్ రాజేశ్వరి, మండల కో ఆప్షన్ మెంబర్ నజీర్, ఎంపీటీసీ మనోహర్‌రెడ్డి, రాజబాబు, సర్పంచ్ రామ్మోహన్, రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎన్ బ్రహ్మానందరెడ్డి, పవన్‌చంద్రారెడ్డి, వెలుగోటి చంద్రశేఖరరెడ్డి, హరినాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఎం మంజునాథ, డ్వాక్రా మహిళలు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు

– ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

పులివెందుల : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రెస్ అకాడమి రాష్ట్ర మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి పెద్ద కర్మ సందర్భంగా సింహాద్రిపురం మండలం కోవరంగుంటపల్లెకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన సోమవారం సాయంత్రం పులివెందులలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేయాలని.. 2024లో పులివెందులలో జరిగే సాధారణ ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కనీవినీ ఎరుగని రీతిలో భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని తెలిపారు. పార్టీ కోసం పనిచేసేవారికి ముఖ్యమంత్రితో పాటు పార్టీ కూడా తగిన విధంగా గుర్తింపు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

– ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా పూటకో ఆలోచనలతో వస్తున్నారని.. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. మీకు ఇన్స్యూరెన్స్ ఉంది.. లక్షల డబ్బులు వస్తాయనీ ప్రముఖ ఇన్స్యూరెన్స్ కంపెనీల పేరుతో ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందనీ ఎస్పీ పేర్కొన్నారు. ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్టీ, ఇతర చార్జీల పేరుతో నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని అమాయకప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. మీ ఇన్స్యూరెన్స్ మెచ్యూరిటీ అయింది.. అని ఎవరినుంచైనా ఫోన్ వచ్చిందంటే మీరు సైబర్ నేరగాళ్ల వలలో పడే ప్రమాదం ఉందని అర్థం చేసుకోవాలని వివరించారు. ప్రజలు ఇటువంటి సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మీకు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీకు ఇన్స్యూరెన్స్ వస్తుంది అంటే నమ్మకండి. మీ బ్యాంక్ ఖాతా వివరాలు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, వివరాలు మీకు తెలియని వారికి పంపవద్దని హెచ్చరించారు.

– ఏమైనా సమస్యలు సందేహాలుంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానీ లేదా సైబర్ మిత్ర వాట్సాప్ నెం. 91212 11100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

మట్టి కుండలకు గిరాకీ


పులివెందుల రూరల్ : వేసవి కాలంలో పేదోడి ఫ్రిజ్‌లుగా పిలిచే మట్టి కుండలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. వీటికి గిరాకీ పెరిగింది. మట్టి బానలు, కుండలు, కడవలకు గిరాకీ పెరిగింది. వీటిలో నీరు పోసి తాగితే చల్లదనంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని అంటున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల, మడూరు, ముతుకూరు, మరికొన్ని గ్రామాల్లో మట్టి కుండలు, బానలు, కడవలు తయారు చేస్తున్నారు. సాంకేతిక మార్పుల నేపథ్యంలో కడవలకు కుళాయిలను అమర్చి అమ్ముతున్నారు. ఫ్రిజ్‌లోని నీటి కంటే కడవలు, బానలలో ఉన్న నీరు తాగడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

– కుండలు, బానలు, కడవలు సైజును బట్టి ధరలను నిర్ణయించారు. రూ. 100 నుంచి రూ. 300 వరకు ధర పలుకుతున్నాయి. వేసవి సీజన్‌లో వీటి అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు.





చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్య సంరక్షణ



వల్లూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్ వాడీ కార్యకర్తలు



సింహాద్రిపురం: బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వల్లూరు: చిరు ధాన్యాలను రోజు వారీ ఆహారంలో చేర్చుకోవడం వలన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి అవకాశం వుందని ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, మండల స్పెషలాఫీసర్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిరు ధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరు ధాన్యాలు సిరి ధాన్యాలని పేర్కొన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అమరేశ్వరి, ఎంపీడీఓ రఘు, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఓ సాయి జ్యోతి, ఏపీఎం శైలజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, మేరీ విజయ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం అంగన్‌వాడీ –2 కేంద్రంలో సోమవారం చిరుధాన్యాల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతకుమారి మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే గర్భవతులు, బాలింతలకు వెల్ బేబీ కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ పోషకాలతో పాటు కూడిన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

రోడ్ల పనులను త్వరగా చేపట్టండి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : వివిధ గ్రామాలకు అనుసంధానం చేసే బీటీ రోడ్ల పనులను త్వరగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని పాడా కార్యాలయంలో పీఆర్ ఈఈ ఓబుళరెడ్డి సమక్షంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలవలపాడు – బూచుపల్లె మధ్య 19కి.మీ బీటీ రోడ్డును నాలుగు మండలాలను కలుపుతూ రోడ్డు పనులు, నల్లపురెడ్డిపల్లె – మురారిచింతల వరకు బీటీ పనులు, అచ్చవెళ్లి– గుండ్ల మడుగు, చిన్నకుడాల – లింగాల రోడ్డు, జంగంరెడ్డిపల్లె – కుమ్మరాంపల్లె కాలనీ వరకు బీటీ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు వివరించారు. అలాగే బిదినంచర్ల – దంతెలపల్లె రోడ్డు ఫార్మేషన్ పనులు, అహోబిలం – బోడివారిపల్లె గ్రామాల మధ్య రోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. అలాగే వివిధ మండలాల్లో కొనసాగుతున్న పనులు, ప్రారంభించాల్సిన పనులు, పురోగతి పనులు, పూర్తయిన పనుల వివరాలను ఓఎస్డీకి వివరించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈలు సుధాకర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, రామప్రసాద్ రెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి